జోరుగా వాటర్ దందా

- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ప్లాంట్లు
- నిబంధనలు పాటించని నిర్వాహకులు
- తుప్పుపట్టిన యంత్రాలు,
- ఏళ్ల తరబడి వాడుతున్న క్యాన్లు
- వినియోగదారులకు పొంచి ఉన్న ముప్పు
- రోజుకు రూ.లక్షల్లో వ్యాపారం
- చోద్యం చూస్తున్న అధికారులు



నిర్మల్‌లో ఆర్వో ప్లాంట్ వద్ద డబ్బాలో నింపుతున్న నీరు



ఆటోలో తీసుకెళ్తున్న వాటర్ క్యాన్లు

నిర్మల్‌టౌన్: జిల్లాలో మినరల్ వాటర్‌ప్లాంట్ల దందా జోరుగా సాగుతోంది. ప్రభుత్వ అనుమతుల్లేకుండా కొందరు నిర్వాహకులు యథేచ్ఛగా వాటర్‌ప్లాంట్లను ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతూ రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. మున్సి పాలిటీలు, మండల కేంద్రాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్లే ఎక్కువే. ప్లాంట్లలో తుప్పు పట్టిన యంత్రాలు, ఏళ్ల తరబడి ఇంటింటికీ సరఫరా చేసే క్యాన్లు నీటి నిల్వ ట్యాంకులు పాకురుతో దర్శనమి స్తున్నా యి. ప్లాంట్లలో శుద్ధజలం(ప్యూరీఫైడ్) అని నమ్మి కొనుగోలు చేస్తున్న ప్రజలు రోగాల బారిన పడి ఆసుపత్రి పాలవుతున్నారు. మరోవైపు ప్లాంట్లను తనిఖీ చేసి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు.. తమకేం పట్టనట్లు వ్యవహరిస్తు న్నారు. మున్సిపల్, ఆ హార కల్తీ నిరోధక శాఖల మధ్య సమన్వయలోపం నిర్వాహకులకు కలిసివస్తుంది.

ప్లాంట్ ఏర్పాటుకు నిబంధనలివే..

వాటర్ ప్లాంట్ నిర్వహణ తీరుపై గతంలో హైకోర్టులో విచారణలు కొనసాగాయి. నిబంధనలు గాలి కొదిలేస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని పలు శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ప్రమాణాలు పాటించాల్సి ఉంటుంది. మినరల్ వాటర్ ప్లాంట్ల ఏర్పాటుకు పలు శాఖల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. మొదట పరిశ్రమలశాఖ, ఫుడ్ సెక్యూరిటీ, విద్యుత్‌శాఖ, మున్సిపల్ లేదా సంబంధిత గ్రామ, మండల అధికారుల అనుమతులు పొందాల్సి ఉంటుంది. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్(బీఎస్ఐ) గ్రౌండ్ పొల్యూషన్ శాఖ ఇలా మొత్తం ఆరు అనుమతులు పొందాలి. నీటిని నింపే ముందు డబ్బా(వాటర్‌క్యాను)లను శుభ్రం చేయాలి. శుద్ధి చేసేటప్పుడు ఫ్రీజర్ ఫిల్టర్‌తో నీటిలో మలినాలు లేవని నిర్ధారణ అయ్యేంత వరకు రెండు నిమిషాలకోసారి నీటిని పరీక్షించాలి. మలినాలు బ్యాక్టీరియా లేకుండా శుద్ధి చేసే మెంబ్రియాలను వాడాలి. నీటిలో ఫ్లోరైడ్ శా తం 1.0 మిల్లి గ్రాముల్లోగా ఉండేలా చూసుకోవాలి.

సాధారణ డబ్బా రూ.10

వీధికొక వాటర్ ప్లాంట్ నడుస్తుంది. ప్రాంతాలను బట్టి ధర నిర్ణయిస్తున్నారు. సాధారణ(నార్మల్ క్యాన్) డబ్బా రూ.10 నుంచి రూ.15వరకు కూల్ క్యాన్ రూ.25 నుంచి రూ.40 వరకు విక్రయిస్తున్నారు. శుభకార్యాల సమయంలో క్యాన్ల వినియోగం ఎక్కువగా జరుగుతోంది.

నిర్మల్‌లో ఒక్కదానికి అనుమతి లేదు..

జిల్లా కేంద్రంలో మొత్తం 42 వార్డులున్నాయి. మున్సిపాలిటీలోని ఒక్కో వార్డుకు సుమారు 2 నుంచి 5 వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. కానీ క్షేత్రస్థాయిలో ఒక్క ప్లాంట్‌కు కూడా అనుమతి లేదని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. క్యాన్లలో వాటర్ సరఫరా చేయడమే కాకుండా ప్యాకెట్లలో నింపినా నీరును ఐదారు గంటలకు మించి వాడితే ప్రమాదం అని తెలిసినా రెండు మూడు రోజులు నిల్వ ఉంచి అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. పుట్టగొడుగుల్లా పు ట్టుకొస్తున్న వాటర్ ప్లాంట్లు ప్రజల జేబులకు చి ల్లులు పెడుతున్నాయి.

అనుమతులు తప్పనిసరి..

మినరల్ వాటర్ ప్లాంట్ల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. మండలస్థాయిలో అయితే తహసీల్దార్, మున్సిపాలిటీల్లో మున్సిపల్ కమిషనర్ ద్వారా అనుమతులు తీసుకొని ప్లాంట్లను ఏర్పాటు చేయాలి. నిబంధనలు కచ్చితంగా పాటించాలి. అనుమతులు లేని వాటర్ ప్లాంట్ లపై చర్యలు తీసుకుంటాం.

– రత్నకల్యాణి, నిర్మల్ ఆర్డీవో

ఆరోగ్యం దెబ్బతినే అవకాశం..

రోజురోజుకు ఆర్వో వాటర్ తాగే వారి సంఖ్య పెరుగుతోంది. కాబట్టి అధికారులు ఆర్వో ప్లాంట్లను తనిఖీలు చేసి నిబంధనలు పాటిస్తున్నారో లేదో చూడాలి. నీటిలో ఫ్లోరైడ్ శాతం 1.0. మిల్లీ గ్రాములు ఉండేలా చూసుకోవాలి. నిబంధనలు పాటించని ప్లాంట్లలో నీరు తాగితే చిన్నారులు, పెద్దల ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉంది. ఆర్వో వాటర్ కంటే మున్సిపల్ వాటర్ బాగుంటుంది.

– డాక్టర్ నాలం శశికాంత్, ఎం.ఎస్ జనరల్ సర్జన్

వేసవిలో నీటి వ్యాపారం రూ.కోట్లలో జరుగుతోంది. నిత్యం లక్షలాది లీటర్ల నీటిని ప్రజలు వినియోగిస్తున్నారు. భగీరథ నీరు సరిపోక మినరల్ వాటర్ వైపు మొగ్గు చూపుతున్నారు.

చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

జిల్లాలో అనుమతుల్లేని మినరల్ వాటర్ ప్లాంట్ల వైపు అధికారులు కన్నెత్తి చూడడం లేదు. తనిఖీలు చేయాల్సిన ఆయా శాఖల అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారో.. అర్థం కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. అధికారులు తనిఖీ చేసి నిబంధనలు విరుద్ధంగా ఉన్న వాటర్‌ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

సర్కారు బడుల్లోనే చేర్పించాలి



కుంటాలలో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

కుంటాల: నాణ్యమైన విద్య అందిస్తున్న సర్కారు బడుల్లోనే విద్యార్థులను చేర్పించాలని డీపీవో శ్రీ నివాస్ పేర్కొన్నారు. శుక్రవారం కుంటాల రైతువేదికలో బడిబాట అమలుపై పలువురు అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ గ్రామాల్లో ఈనెల 3 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు భాగస్వాములు కావాలని సూచించారు. ఈనెల 5లోగా పాఠశాలలో కొనసాగుతున్న పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్, ఎంపీడీవో ఎంఎ రహీం, ఎంఈవో ముత్యం, హెచ్ఎం లక్ష్మణ్, సూపర్‌వైజర్ లక్ష్మీవిశారద, మండల సమాఖ్య అధ్యక్షురాలు బ్యాగరి లక్ష్మి, ఏఎస్సై రాందాస్, ఏపీఎం అశోక్, ఏపీవో నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

కుంటాల: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని డీపీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయించాలని కోరారు. మురికి కాల్వలను శుభ్రం చేయించి ప్రజలు జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో రహీం, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకల్లో జర్నలిస్టులను గుర్తించాలి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించిన జర్నలిస్టులను జూన్ 2న నిర్వహించే రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో గుర్తించాలని టీయూడబ్ల్యూజేఐజేయూ జిల్లా అధ్యక్షులు కొండూరి రవీందర్, వెంకగారి భూమయ్య శుక్రవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ ఉద్యమాన్ని ప్రపంచం నలుమూలలకు తెలిసేలా చేసేందుకు జర్నలిస్టులు ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వ్యాపారులు, కవులు, కళాకారులు, విద్యార్థులు, రచయితలు ఇలా సబ్బండ వర్గాలను ఏకం చేసిన ఘనత జర్నలిస్టులదేనని అన్నారు. ఈసందర్భంగా జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

మన్మద్‌లో ఆత్మీయ సమ్మేళనం



పాఠశాలలో వేదికపై పూర్వ విద్యార్థులు

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1996–97లో పదో తరగతి చదివిన విద్యార్థులు శుక్రవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలోనే ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వచ్చి చిన్నప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఆనాటి గురువులను ఘనంగా సన్మానించారు. చదువు నేర్పిన గురువులను రుక్మారెడ్డి,రవీందర్‌రెడ్డి, రమేశ్, భీంరావు, మల్లారెడ్డి, నారాయణ్, ఘనంగా సన్మానించారు. అంతకుముందు తమతో కలిసి చదువుకున్న వారిలో మరణించిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

‘ఆదర్శ’లో ఆరో తరగతి జాబితా ప్రదర్శన

కుంటాల: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలోని ఆరో తరగతిలో ప్రవేశం కోసం గత ఏప్రిల్ 17న ప్రవేశ పరీక్ష నిర్వహించారు. పది రోజుల కిందట ఆన్‌లైన్‌లో జాబితా పొందుపర్చిన విషయం తెలిసిందే. శుక్రవారం డీఈవో రవీందర్‌రెడ్డి సమక్షంలో పాఠశాలలో విద్యార్థుల ఎంపిక జాబితాను ప్రదర్శించారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 3,4,5 తేదీల్లో పాఠశాలలో ధ్రువీకరణ పత్రాలు అందించి అడ్మిషన్ పొందాలని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్ సూచించారు.

‘ఏకకాలంలో రుణమాఫీ చేయాలి’

ఖానాపూర్: ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేసి.. రైతుల సమస్యలను పరిష్కరించాలని ఏఐపీకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నందిరామయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ధర్నా నిర్వహించి సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను ఉచితంగా అందించాలని కోరారు. 50 శాతం సబ్సిడీపై మినీ ట్రాక్టర్లను ఇవ్వాలన్నారు. ప్రకృతి విపత్తులతో నష్టపోయే రైతులకు ఎకరాకు రూ.25వేలు పరిహారం చెల్లించాలన్నారు. తక్కువ ధరకు పత్తి కొనుగోలు చేసి రైతులకు నష్టం చేస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల ధాన్యాన్ని భేషరతుగా కొనుగోలు కేంద్రాల్లో కొనాలని డిమాండ్ చేశారు. రాజన్న, శ్రీనివాస్, లచ్చన్న, భీమయ్య తదితరులు ఉన్నారు.

కుట్టు మిషన్లతో ఉపాధి



కుట్టుమిషన్లు పరిశీలిస్తున్న డీడబ్ల్యూవో నాగమణి

లోకేశ్వరం: మహిళలకు ఉపాధి కల్పించడానికే ప్రభుత్వం మహిళా శక్తి టైలరింగ్ కేంద్రాలను ఏ ర్పాటు చేసిందని డీడబ్ల్యూవో నాగమణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మహిళా శక్తి టైలరింగ్ కేంద్రాన్ని డీడబ్ల్యూవో పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 3250 మంది పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తులను సక్రమంగా కుట్టాలన్నారు. ఒక జతకు ప్రభుత్వం రూ.50 చెల్లిస్తుందని.. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో సోలమాన్ రాజ్, ఎంఈవో చంద్రకాంత్, ఏపీఎం మల్లేశ్, సీసీలు సుకుమార్, రాజేశ్వర్ ఉన్నారు.

బడిబాటను పకడ్బందీగా నిర్వహించాలి



ఖానాపూర్‌లో మాట్లాడుతున్న బాబురావు



సారంగపూర్‌లో మాట్లాడుతున్న సురేశ్

ఖానాపూర్: ఈనెల మూడో తేదీ నుంచి 19వ తేదీ వరకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేలా ఆయా శాఖల అధికారులు, సిబ్బంది కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి బాబురావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండలస్థాయి అధికారులు, ఇతర ఉద్యోగులు, సిబ్బందితో నిర్వహించిన సమన్వయ సమావేశంలో మాట్లాడారు. బ డీడు పిల్లలను గుర్తించి సమీప ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. స్వయం సహాయక సంఘాల సభ్యుల భాగస్వామ్యంతో కార్యక్రమం విజయవంతం చేయాలని సూచించారు. తహసీల్దార్ శివరాజ్, మండల నోడల్ అధికారి ప్రేమ్‌సాగర్, ఎంపీడీవో సునీత, ఎస్సై లింబాద్రి, సీడీపీవో సరిత, ఐకేపీ ఏపీఎం భోజన్న, ఎంపీవో చంద్రశేఖర్ ఉన్నారు.

తానూరు: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మండల ప్రత్యేకాధికారి ఆశ్వక్ హైమాద్ మాట్లాడారు. బడీడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఎంపీడీవో మోహన్‌సింగ్, తహసీల్దార్ లింగంమూర్తి, ఎస్సై సందీప్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భైంసారూరల్: బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంఈఓ సుభాష్ అన్నారు. భైంసా మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

సారంగపూర్: బడిబాట కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు, ఐకేపీ సిబ్బంది, గ్రామస్తులు విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి సురేశ్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో బడిబాట, అమ్మ ఆదర్శ పాఠశాల పనులపై స్వయం సహాయక సంఘాల సభ్యులు, ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీఓ తిరుపతిరెడ్డి, ఎంఈఓ మధుసూదన్, మండల నోడల్ అధికారి జనార్దన్, పంచాయతీరాజ్ ఏఈ శరత్, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

లోకేశ్వరం: బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని మండల విద్యాధికారి చంద్రకాంత్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండలంలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, మండల సమాఖ్య సభ్యులకు బడిబాట కార్యక్రమంపై అవగాహన కల్పించారు. తహసీల్దార్ మోతీరాం, డీటీ రవీందర్, ఏపీఎం మల్లేశ్ తదితరులు ఉన్నారు.

అహల్యబాయిని ఆదర్శంగా తీసుకోవాలి



తానూరులో పాల్గొన్న నాయకులు



ముథోల్‌లో..

తానూరు: మహ్మదీయుల దాడుల్లో శిథిలమైన కాశీ, ద్వారక, మధుర, ఉజ్జయిని, రామేశ్వరం, అయోధ్య, హరిద్వార్ పుణ్యక్షేత్రాలను మళ్లీ నిర్మించిన రాజ్యమాత అహల్యాబాయిని ఆదర్శంగా తీసుకోవాలని పలువురు నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంతోపాటు దాగాం, సింగన్‌గాం గ్రామాల్లో రాజ్యమాత అహల్యాబాయి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు విఠల్, మాధవ్‌రావ్ పటేల్, సోంనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ముథోల్: మండల కేంద్రంలో రాజమాత అహల్యబాయి హోల్కర్ జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ దేవోజీ భూమేశ్ మాట్లాడుతూ ముష్కరుల దాడులకు భయపడకుండా రాజ్యాన్ని కాపాడుకొని ఎన్నో శైవ క్షేత్రాలను నిర్మించిన ఘనత వారికే దక్కుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కుర్మ సంఘం సభ్యులు సాయినాథ్, కోలేకర్ శంకర్, ఉరేకర్ సాయన్న, పోతన్న, శివాజీ, రాము, సభ్యులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్‌లో గురువారం రాత్రి గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. కూలీ పనులు చేసుకునే ఆమె స్థానికంగా అద్దె ఇంట్లో ఉంటోంది. మూర్ఛతో ఇంట్లో పడిపోయి మృతి చెందింది. శుక్రవారం ఉదయం ఆమె బయటకు రాకపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. మృతురాలి వయసు 45–50 ఏళ్లు ఉంటుందని, మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. తెలిసినవారు పట్టణ పోలీసులను సంప్రదించాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

భైంసారూరల్: మండలంలోని దేగాం శివారులో శుక్రవారం సాయంత్రం పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పక్కా సమాచారంతో శి వారులో పేకాట ఆడుతున్న నలు గురిని పట్టుకొని వారి నుంచి రూ.6500 స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. అనంతరం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

అటెన్షన్ ప్లీజ్.. ప్రమాదకరంగా రోడ్డు



తానూరు: ముథోల్ నుంచి తానూరు మండలం ఎల్వత్ గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు గతేడాది వర్షాలకు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ నుంచి మహారాష్ట్రలోని ధర్మాబాద్ వెళ్లే మార్గం కావడంతో ఎప్పుడు ఏయే ప్రమాదం చోటు చేసుకుంటుదోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: జగదీశ్, పీఆర్ ఏఈ, ఫోన్: 91211 35623

ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

నిర్మల్‌చైన్‌గేట్: గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆశావర్కర్ల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు సుజాత పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశవర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం డీఎంహెచ్‌వో, కలెక్టరేట్ కార్యాలయాల సిబ్బందికి వినతిపత్రాలు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశవర్కర్లకు ఇస్తున్న పారితోషికాలను రూ.18వేలకు పెంచాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు చెల్లిస్తూ ఇస్తున్న పారితోషికాల్లో సగం పెన్షన్ చెల్లించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వెంటనే ఆశాలకు విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలన్నారు. పీఆర్సీతో పాటు మూడేళ్ల లెప్రసీ సర్వే పెండింగ్ డబ్బులు వెంటనే చెల్లించాలని కోరారు. తమను వేధిస్తున్న జిల్లా అధికారులపై చర్యలు తీసుకోవడంతోపాటు ప్రసూతి సెలవులు, ఏటా 20 రోజులు సాధారణ సెలవులు ఇవ్వాలని పేర్కొన్నారు. ఆశాలకు ఏఎన్ఎం, జీఎన్ఎంగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, నాయకురాలు సునీత పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శ్రీలత

ఖానాపూర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వర్తించే టీచర్లు, హెల్పర్లు సమయపాలన పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించిన పెంబి సెక్టార్ సమావేశానికి హాజరై మాట్లాడారు. త్వరలో ప్రారంభమయ్యే బడిబాట కార్యక్రమంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు నిండిన చిన్నారులను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. అన్ని రకాల రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని కోరారు.

క్లుప్తంగా

పూడిక తొలగింపు



చెత్తాచెదారం తొలగిస్తున్న కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని ప్రధాన డ్రైయినేజీ చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. దీనిపై ఈనెల 31న సాక్షిలో ‘కంపు కొడుతున్న డ్రైయినేజీ’ శీర్షికన ప్రచురితమైన కథనానికి ప్రత్యేకాధికారి శ్రీనివాస్ స్పందించారు. శుక్రవారం వారి ఆదేశా ల మేరకు పంచాయతీ సిబ్బంది డ్రెయినేజీలో పూడిక తీసి ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించారు.

ఇసుక వాహనం పట్టివేత

తానూరు: మహారాష్ట్రలోని ధర్మాబాద్ నుంచి తానూరుకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఐచర్ వాహనాన్ని శుక్రవారం తానూరు సమీపంలో పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ధర్మాబాద్ నుంచి తానూరుకు ఇసుక తీసుకొస్తున్న ఐచర్ వాహనానికి అనుమతుల్లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. పట్టుకున్న వాహనాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగిస్తామని వెల్లడించారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం



ఆలయం వద్ద భక్తులు

సోన్: మండలకేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి–గోవిందమ్మ కల్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు శ్రీ రామోజీ అన్వేశ్, శ్రీనివాసచారి, సురేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టుకు స్వాములు



బయలుదేరిన స్వాములు

కుభీర్: మండల కేంద్రంలోని హనుమాన్ దీక్షాపరులు శుక్రవారం మాల విరమణకు కొండగట్టుకు తరలివెళ్లారు. ఉదయం స్థానిక విఠలేశ్వర మందిరంలో నగర సంకీర్తన అనంతరం కొండగట్టుకు తరలివెళ్లారు. కొండగట్టుకు తరలిన వారిలో గురుస్వాములు పి.పిరాజీ, దొంతుల దత్తాత్రి, గంగాధర్, పోతన్న, అక్షయ్ తదితరులు ఉన్నారు.

నిరుపేదకు అంత్యక్రియలు

కడెం: మండల కేంద్రానికి చెందిన గిరిజనుడు బాపురావు గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. మండలంలోని పెద్దూర్‌కు చెందిన బీజేపీ నాయకుడు అమరవేణి రవీందర్‌గౌడ్ శుక్రవారం బాపురావు అంత్యక్రియలను జరిపించి మానవత్వం చాటాడు. బాపురా వుకు భార్య, నలుగురు పిల్లలున్నారని.. ప్రభుత్వం వీరి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

అనాథ శవానికి..

నిర్మల్‌రూరల్: మండలంలోని కొండాపూర్‌లో శుక్రవారం పంచాయతీ ఆధ్వర్యంలో ఓ అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామానికే చెందిన అల్లం నరసవ్వ(65) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెంది ంది. ఈమె అనాథ కావడంతో మాజీ స ర్పంచ్ గంగాధర్, పంచాయతీ సిబ్బంది ఆధ్వర్య ంలో గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించా రు.

రాగిదుబ్బకు కరెంట్ ఇవ్వాలి

పెంబి: మండలంలోని పుల్గంపాండ్రి పంచాయతీ పరిధిలోని పెద్ద రాగిదుబ్బ గ్రామానికి కరెంట్ సౌకర్యం కల్పించాలని సీపీఐఎం న్యూడెమోక్రసి జిల్లా కార్యవర్గ సభ్యుడు మంచికంటి లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం గ్రామస్తులతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మణ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ పెద్ద రాగిదుబ్బ గ్రామం ఏర్పడి 30 ఏళ్లవుతున్నా.. ఇప్పటికీ అంధకారంలో జీవిస్తున్నారని పేర్కొన్నారు. రోడ్డు, కరెంట్ సౌకర్యం కల్పించకుంటే సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. గ్రామస్తులు జంగు, సుర్యారావు, దేవారావు, లింగు ఉన్నారు.

ఆటో బోల్తా.. ఒకరికి గాయాలు

నర్సాపూర్ (జి): మండలంలోని నసీరాబాద్ గ్రామంలో శుక్రవారం ఆటో బోల్తా పడిన ఘటనలో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. భైంసా నుంచి నిర్మల్ వైపు వెళుతున్న ఆటోను మండలంలోని నసీరాబాద్ గ్రామం వద్ద కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో పల్టీలు కొట్టి రోడ్డు పక్కన కూర్చొన్న గ్రామానికి చెందిన రాములుపై పడింది. ఈ ప్రమాదంలో రాములుకు స్వల్ప గాయాలయ్యాయి.